క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం

అద్దంకి: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఉదయం 9 గంటలకు చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయక పోవడాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. నియజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టోను గుర్తుకు తెస్తూ నియోజకవర్గ స్థాయిలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున హాజరవుతారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

సామాజిక పెట్టుబడి నిధి రికవరీలు వేగవంతం చేయాలి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకునేలా కృషి చేయాలని ఏపీఎం పి.మధుసూదనరావు సూచించారు. బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం వీవోఏలతో ఆయన సమావేశమయ్యారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రుణాలు అందిస్తోందని, పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధిని పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. సామాజిక పెట్టుబడి నిధి రికవరీలు రూ.45 లక్షలు ఉండగా రూ.37 లక్షలు వసూలు చేశారని, మిగిలిన రికవరీలు త్వరగా చేయాలన్నారు. పొదుపు గ్రూపుల ఆడిట్‌లు క్రమం తప్పకుండా చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా మండలంలో అందించిన రుణాల రికవరీలు చేయాలన్నారు. సమావేశంలో సీసీ, సీపీలు, పొదుపు సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

పర్చూరు (చినగంజాం): తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా పర్చూరు వైఆర్ హైస్కూల్లో బుధవారం మండల స్థాయి పోటీలు నిర్వహించారు. పోటీల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, కథలు చెప్పటం, పాటలు పాడటం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పర్చూరు విద్యాశాఖాధికారి ఎం. సత్యనారాయణ, పి.వెంకటరామయ్య, వైఆర్ హైస్కూల్ హెచ్‌ఎం రాజశేఖర్, పర్చూరు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ఎం.నాగిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత నియమాలపై ర్యాలీ

చీరాల అర్బన్: విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ఉండాలంటే పని కంటే భద్రత ఎంతో ముఖ్యమని విద్యుత్ శాఖ చీరాల ఈఈ జాన్ థామస్ అన్నారు. జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వాడరేవు రోడ్డులోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జీవితం ఎంతో విలువైందని, భద్రత ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. చెప్పులు లేకుండా విద్యుత్ పరికరాలను తాకకూడదని, లోహపు ఆధార తీగలను, తెగిపోయిన తీగలను తాకకూడదన్నారు. విద్యుత్ సరఫరా నిలిపేయకుండా ఏ పరికరాలకు మరమ్మతులు చేయకూడదన్నారు. భారత విద్యుత్ నిబంధనలను అనుసరించాలన్నారు. డీఈఈ బి.హరిప్రసాదరావు, పర్చూరు డీఈఈ జె.శ్రీనివాసులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


సురేష్ (ఫైల్)

జె.పంగులూరు: ఆర్థిక ఇబ్బందులతో రామకూరు గ్రామానికి చెందిన ఎర్రబోయిన సురేష్ (35) గత నెల 26వ తేదీన పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు వెంటనే గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చనిపోయాడు. మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌లో పోస్టుమార్టం చేయించి బుధవారం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. సురేష్‌కు భార్య తిరుపతమ్మ, కూతురు విద్య 8వ తరగతి, కుమారుడు హరీష్ 6వ తరగతి, జాహ్నవి 4వ తరగతి చదివే ముగ్గురు పిల్లలు ఉన్నారు. రేణింగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ డిపో పరిశీలన


సిబ్బందితో మాట్లాడుతున్న డీపీటీవో

అద్దంకి రూరల్: బాపట్ల డీపీటీవో సామ్రాజ్యం అద్దంకి ఆర్టీసీ డిపోను బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా డిపోలోని వసతులు పరిశీలించారు. డీఎం రామ్మోహన్‌రావుకు పలు సూచనలు చేశారు. ఉద్యోగులతో మాట్లాడారు. డిప్యూటీ డీఎం మహబూబీ, సిబ్బంది పాల్గొన్నారు.

మాట తప్పిన కూటమి ప్రభుత్వం


జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

అద్దంకి: ఎన్నికలకు ముందు స్మార్టు మీటర్లను పగులగొట్టండి.. అని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి మాట తప్పిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూర్ణచంద్రశేఖర్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆరో మహాసభ పుట్టావారిపాలెంలోని గుర్రం కొండలరావు ఆవరణలో బుధవారం నిర్వహించారు. సభకు తుమ్మల పూర్ణచంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ కోటేశ్వరరావు హాజరయ్యారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ తర్వాత వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న పార్టీ ఇదేనన్నారు. కరెంటు చార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచి కూటమి ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. ఉపాధి హామీ పథకంలో అధికారులు చేస్తున్న మోసాలను ఉపాధి కార్మికులు గుర్తించి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వారికి అండగా ఉంటున్నామని చెప్పారు. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు ప్రభుత్వమే భూములు కొనుగోలు చేసి ఇవ్వాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించకపోగా సిందూరం పేరుతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తోందని విమర్శించారు. నూతనంగా ఎన్నుకున్న నాయకులు ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా పార్టీ కార్యదర్శి తన్నీరు శింగరకొండ, కేఎల్‌డీ ప్రసాద్, అద్దంకి నాగేశ్వరరావు, ఖాదర్‌బాషా, ఏసోబు, మేకల వెంకాయమ్మ, జి. ప్రసాద్, జి.వెంకటసుబ్బయ్య, యలమందయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

అద్దంకి: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు జీవో నంబర్ 36ను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఇంజినీరింగ్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం అద్దంకి మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం స్కిల్ వర్కర్స్‌కు రూ.24 వేలు, అన్ స్కిల్ వర్కర్స్‌కు రూ.21 వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా పది రోజుల నుంచి వివిధ రూపాల్లో ఇంజినీరింగ్ విభాగం కార్మికులు ఆందోళన చేపట్టారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని, వెంటనే యూనియన్ నాయకులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 4వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ సీనియర్ జిల్లా అధ్యక్షుడు పి.ఆదాం, అద్దంకి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జి.భీష్మ, ఇంజినీర్ విభాగం యూనియన్ కార్యదర్శి ఉసురుపాటి సామ్యేలు, కె.జాన్, మారుతి, మార్కు రవి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు

● ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు


ఇసుక తరలించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

వేటపాలెం: చీరాల నియోజకవర్గం పరిధిలో ఇసుక అక్రమ తరలింపుపై చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ టి.చంద్రశేఖర్ నాయుడు హెచ్చరించారు. బుధవారం వేటపాలెం మండలం పరిధిలోని అక్రమంగా ఇసుక తరలిస్తున్న వివిధ ప్రాంతాలను డీఎస్పీతో కలిసి ఆయన పరిశీలించారు. పుల్లరిపాలెం పంచాయతీ బచ్చులవారిపాలెం దగ్గరలోని 179 సర్వే నంబరు వాన్‌పిక్ భూముల్లో, దేశాయిపేట పంచాయతీ పరిధిలోని రైల్వే గుట్టు సమీప భూముల్లో నుంచి ఇసుక అక్రమంగా తరలించిన ప్రాంతాలను పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ మండలం పరిధిలోని ప్రధాన రహదారుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఇసుక అక్రమ తరలింపును అడ్డుకుంటామని తెలిపారు. వీరి వెంట డీఎస్పీ మొయిన్, రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై జనార్దన్, రెవెన్యూ సిబ్బంది కృష్ణవేణి, పురుషోత్తం ఉన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం


కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కారంచేడు: గ్రామాల్లోని పేద ప్రజలకు ఉపాధి కల్పించే దిశగా బీసీ, ఓసీల్లోని మహిళలను గుర్తించి వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా పలు రకాల శిక్షణలు అందిస్తోందని ఎంపీడీఓ కె.నేతాజీ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రం కారంచేడు గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కుట్టు శిక్షణకు ఎంత మంది హాజరయ్యారు, ఎంత మందికి హాజరు వేసారని రిజిస్టర్‌లు పరిశీలించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ చక్కగా కుట్టు శిక్షణలో పాల్గొని మెళకువలు నేర్చుకోవాలన్నారు. 90 రోజుల శిక్షణ అనంతరం ప్రభుత్వం వారికి కుట్టు మిషన్ కూడా ఉచితంగా అందించి వారికి భవిష్యత్తులో మంచి జీవనోపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోవు రోజుల్లోనూ ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను ముమ్మరం చేస్తామన్నారు. ఈఓపీఆర్డీ ఎల్‌కే కృష్ణ, పంచాయతీ సిబ్బంది, కుట్టు ట్రైనర్, మహిళలు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఘన వీడ్కోలు


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సిబ్బంది

చినగంజాం: మండలంలోని పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను ప్రస్తుత పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. బుధవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులకు సత్కార కార్యక్రమంతో పాటు బదిలీపై పాఠశాలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు ఘన ఆహ్వానం పలికారు. ఉపాధ్యాయులు డి.నారాయణరెడ్డి, బి.నాగేశ్వరరావు, ఎ. వీరాచారి, బి.చెంచిరెడ్డి, పి.బ్రహ్మయ్య, ఎస్.శ్రీరమణ, ఎం.రాజశేఖర్, జి. హవీలా దేవిలను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కొత్తగా వచ్చి చేరిన ఏడుగురు ఉపాధ్యాయులకు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.రవికుమార్, యూటీఎఫ్ నాయకులు కొమ్మోజీ శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆసోది సుదర్శన రెడ్డి, కె.నాగరాజు, మరియన్‌బాబు, ఎన్.రమణమూర్తి, ఎల్.శివప్రసాద్, పీడీ అనిల్‌కుమార్, ఏ.సుబ్బారావు, సీఆర్‌పీ రామకృష్ణ, రికార్డ్ అసిస్టెంట్ కుమార్, గ్రామ పెద్దలు, రామదండు సభ్యులు, పెదగంజాం ఎంప్లాయిస్ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కమిటీ ఎన్నిక


పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

పర్చూరు (చినగంజాం): మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం స్థానిక ఎమ్మార్సీ సమావేశ మందిరంలో నిర్వహించారు. మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా మస్తాన్‌రావు, ఉపాధ్యక్షులుగా పి.వెంకటేశ్వరరావు, బి.హరిప్రసాద్, కె.సత్యనారాయణలను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వి.అనిల్ కుమార్, సహాయ కార్యదర్శులుగా పి.పినాకపాణి, పి.రాజయ్య, కె.అనూష, పి. పున్నారావు, కోశాధికారిగా కె.లక్ష్మీనరసయ్యలను ఎన్నిక చేశారు. కమిటీ ఎన్నిక ప్రక్రియ సీనియర్ పంచాయతీ కార్యదర్శి కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు. నూతనంగా ఎంపికైన మస్తాన్‌రావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యాచరణ ప్రణాళికలను తయారు చేయనున్నట్లు ప్రకటించారు.

ఎలాంటి దుష్ప్రభావం లేనిది హోమియో వైద్యం


హోమియో వైద్యం గురించి వివరిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పర్చూరు (చినగంజాం): జీవితాంతం ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా ఆరోగ్యాన్ని కాపాడేది హోమియో వైద్యం అని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం హోమియో వైద్య విధానాన్ని కనిపెట్టిన జర్మన్ వైద్యుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ 182వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన హోమియో వైద్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా హానిమన్‌కు నివాళులర్పించారు. ఎవరికీ అంతుచిక్కని మొండి వ్యాధులకు సైతం అత్యంత సులభంగా సంపూర్ణంగా హోమియోపతిలో నయం చేయవచ్చన్నారు. పంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా


కారంచేడులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

కారంచేడు: బాపట్ల ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామాల్లో అక్రమ రవాణాను అరికట్టేలా ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా అన్నారు. బుధవారం రాత్రి ఆయన మండల కేంద్రం కారంచేడులో వాడరేవు–పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో ప్రయాణించే అనేక వాహనాలను తనిఖీ చేశారు. మనకు సమీప రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను మరింత క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. వాహనదారులు తప్పకుండా వాహనాలకు సంబంధించిన అన్ని రకాల పత్రాలను వెంట తెచ్చుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఆటోల్లో ప్రయాణించే ప్రయాణికులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణించవద్దన్నారు. మితిమీరిన వేగంతో ప్రయాణిస్తే అనేక ప్రమాదాలు జరుగుతాయన్నారు. ప్రతాలు లేని వాహనాలకు ఆయన జరిమానా విధించారు.

వాహనాల తనిఖీ

బల్లికురవ: వాహన డ్రైవర్లు సీటుబెల్టు ధరిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై వై.నాగరాజు కోరారు. బుధవారం రాత్రి బల్లికురవ 4 రోడ్ల కూడలిలో పలు వాహనాలను ఆయన తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా అక్రమ తరలింపు చేపడితే కేసు నమోదుతో పాటు సంబంధిత వాహనాన్ని సీజ్ చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

పర్చూరు (చినగంజాం): సంఘ విద్రోహ చర్యలను అడ్డుకునే కార్యక్రమంలో భాగంగా బుధవారం పర్చూరు పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఎస్ఐ జీవీ చౌదరి ఆధ్వర్యంలో స్థానిక వై జంక్షన్ వద్ద పలు వాహనాలను ఆపి తనిఖీ చేసి పంపించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్తలు పాటించే కార్యక్రమంలో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు హనిమిరెడ్డి పరామర్శ


సాంబిరెడ్డిని పరామర్శిస్తున్న హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: ఇటీవల అనారోగ్యానికి గురైన మండలంలోని రామాయపాలెం మాజీ సర్పంచ్ ఉప్పులూరి సాంబిరెడ్డిని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన వెంట అద్దంకి పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధకృష్ణమూర్తి, మండల కన్వీనర్‌లు, పార్టీ నాయకులు ఉన్నారు.

ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలి

చీరాల టౌన్: రెవెన్యూ సేవలను సత్వరంగా అందించడంతో పాటు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని తహసీల్దార్ కె.గోపీకృష్ణ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనిచేసే గ్రామ, మండల స్థాయి అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేస్తూ అందుబాటులో ఉండాలన్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా నీటి తీరువా వసూళ్లను త్వరగా చేయడంతో పాటు వివిధ ధ్రువీకరణపత్రాల కోసం వచ్చిన అర్జీలను విచారించి త్వరగా ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల వారీగా పెండింగ్ అర్జీలపై విచారించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలని, ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశించిన సమయానికి పూర్తి చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. రెవెన్యూ సిబ్బంది విధుల్లో అశ్రద్ధ వహించినా, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సుశీల, వీఆర్వోలు పాల్గొన్నారు.

గిరిజనుల విద్యాభివృద్ధికి సహకారం


నోట్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో సభ్యులు

వేటపాలెం: పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి సహాయ సహకారాలు అందించనున్నట్లు పట్టభద్రులు సంఘ అధ్యక్షుడు పత్తి వెంకట సుబ్బారావు పేర్కొన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 67 మంది విద్యార్థులకు పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా నోట్ పుస్తకాలు బుధవారం పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు చదువుల్లో అభివృద్ధి చెందేందుకు ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. సంఘ ఆర్గనైజింగ్ సెక్రటరీ బట్ట మోహన్‌రావు, మెంటర్ శరత్‌బాబు, శేఖర్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు అరుణాదేవి, మార్గరేట్, ప్రమీల, నాగ మల్లిక పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ప్రసాద్‌రెడ్డి


వైఎస్ జగన్‌తో ప్రసాద్‌రెడ్డి

చీరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కోడూరి ప్రసాద్ రెడ్డి మంగళవారం తాడేపల్లిలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న తనను యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడంపై ఆయన వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్పందించిన ఆయన పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని, పనిచేసే కార్యకర్తలను గుర్తుపెట్టుకుంటానని, అండగా ఉంటానని తెలిపారన్నారు.

ఎంపీ వైవీకి ఘన స్వాగతం


వైవీకి స్వాగతం పలుకుతున్న ప్రసాదరెడ్డి

బల్లికురవ: బాపట్లలో బుధవారం జరిగిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గాల ఇన్‌చార్జిల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యుడు, పార్టీ రీజనల్ కోర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీప్రసాదరెడ్డి బొకేతో స్వాగతం పలికారు. జిల్లాలోని బాపట్ల, వేమూరు, రేపల్లె, అద్దంకి, చీరాల, పర్చూరు ఇన్‌చార్జిలతో పాటు జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున హాజరయ్యారు. సమావేశంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికలపై చర్చించినట్లు ప్రసాదరెడ్డి వివరించారు.

రోగులకు పండ్లు పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

చీరాల అర్బన్: ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 75వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం చీరాలలోని ఎల్ఐసీ ఉద్యోగులు స్థానిక ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే మహిళా మండలి ప్రాంగణంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ 75వ వార్షికోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయకుమార్, రామిరెడ్డిలు తెలిపారు. ఎల్ఐసీ చీరాల మేనేజర్ రమేష్ బాబు, ట్రెజరర్ సుబ్బారావు, బ్రాంచి సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి: ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐఐఈఏ) 75వ ఆవిర్భావ వేడుకలను పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెండాను ఆవిష్కరించారు. బ్రాంచ్ నాయకుడు వినీత్ శివ నాయక్, కోటేశ్వరరావు, అమర్‌నాథ్, కృష్ణమోహన్, రవి, బీఎం సత్యనారాయణ, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

బల్లికురవ: బతుకుదెరువుకు జిల్లాలు దాటి వలస వచ్చి గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టటంతో తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం చెన్నుపల్లి–అనంతవరం రోడ్డులో వేమవరం జంక్షన్ సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం .. అనంతపురం జిల్లా గుత్తి ప్రాంతానికి చెందిన మేకల నాగార్జున ఇక్కడ గ్రానైట్ పరిశ్రమలో పని చేస్తూ పల్నాడు జిల్లా మురికిపూడిలో మకాం ఉంటున్నాడు. భోజనానికి పల్సర్ బైకుపై మురికిపూడి వెళ్తుండగా మలుపులో ఎదురుగా వస్తున్న లారీ బైకును ఢీకొట్టడంతో నాగార్జున తీవ్ర గాయాలపాలయ్యాడు. బైకు లారీ కిందపడి నుజ్జునుజ్జయింది. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ అశోక్ పైలెట్ రామాంజనేయులు ప్రాథమిక చికిత్స చేసి ఉన్నత చికిత్సకు క్షతగాత్రుడిని చిలకలూరిపేట వైద్యశాలకు తరలించారు. ఎస్సై వై.నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వల్లాపల్లి వద్ద ఇద్దరికి గాయాలు

బల్లికురవ–అద్దంకి ఆర్అండ్‌బీ రోడ్డులోని వల్లాపల్లి గ్రామ సమీపంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టటంతో వారు గాయాలపాలయ్యారు. వల్లాపల్లి గ్రామానికి చెందిన చింతల ఇమ్మానియేల్, బొంతు మరియదాసు గాయపడగా స్థానికులు చికిత్స కోసం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.


వేమవరంలో లారీ కింద నుజ్జునుజ్జయిన బైకు


నాగార్జునను చికిత్సకు తరలిస్తున్న 108 సిబ్బంది

ఏఎంసీ పాలక మండలి ప్రమాణ స్వీకారం


మంత్రితో ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్

అద్దంకి రూరల్: అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో ప్రమాణ స్వీకారం చేసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరైయ్యారు. అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వరగాని పద్మావతి, వైస్ చైర్మన్‌గా ధర్మవరపు నాగేశ్వరరావు, బొప్పూడి భారతి, గుంజి రేణక, కోపర్తి నాగరాజు, మేకల అంకమ్మ, పూనాటి పద్మ, రామపాటి రామాంజమ్మ, షేక్ రహీమున్‌బీ, చింత వెంకటేశ్వర్లు, గుంజి రామాంజనేయులు, కర్నాటి పూర్ణచంద్రరావు, కురిచేటి వెంకట సుబ్బారావు, మిద్దెబోయిన పాపారావు, ముద్దుమాల నారయ్య సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం ఆషాఢ మాసం హస్త నక్షత్రం అష్టమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.30 గంటల వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోష కాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.